క్లుప్తంగా

టీబీ పరీక్ష చేయించుకోవాలి



టీబీ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

కల్లూరు: రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం , రాత్రి పూట చెమటలు, బరువు తగ్గిపోవడం, ధూమ, మద్యపానం సేవించు, పౌష్టికాహారం లోపం ఉన్నవారందరూ టీబీ పరీక్షలు చేయించుకోవాలని కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మోతీలాల్ నాయక్ అన్నారు. సోమవారం కల్లూరు పీహెచ్‌సీ పరిధిలోని కె.మార్కాపురం గ్రామంలో టీబీ ముక్త్ భారత్ కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధి గురించి ఉన్న మానసిక రుగ్మతను తీసివేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దిలేటి, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు



గూడూరులో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర సాయుధ బలగాలు

కోడుమూరు రూరల్: కేంద్ర సాయుధ బలగాలైన ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సోమవారం గూడూరు పట్టణ వీధుల్లో కవాతు నిర్వహించింది. ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కమాండెంట్ విజయకుమార్ వర్మ, అసిస్టెంట్ కమాండెంట్ పాపారావు కీర్తి, ఇన్‌స్పెక్టర్లు రాజు, భారతి, గూడూరు ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యంలో సాయుధ బలగాలు కవాతు నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలకు తాము ఉన్నామంటూ భరోసా కల్పించారు. రానున్న స్వాతంత్ర్య దినోత్సవం, వినాయక చవితి వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని వారు ప్రజలకు సూచించారు.

పారా అథ్లెటిక్స్‌లో రెండు స్వర్ణాలు

కర్నూలు (టౌన్): రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీల్లో కర్నూలుకు రెండు స్వర్ణాలు దక్కాయి. విశాఖపట్నంలో నిర్వహించిన పారా అథ్లెటిక్స్ జూనియర్ పోటీల్లో పెద్దపాడు ఏపీ మోడల్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న భావ్యశ్రీ షాట్‌పుట్, డిస్కస్‌త్రో క్రీడాంశాల్లో పాల్గొని రెండు బంగారు పతకాలు సాధించారు. ఆమె వచ్చే నెలలో గ్వాలియర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికకావడం సంతోషించదగ్గ విషయమని ప్రిన్సిపాల్ ఎస్‌వీ వీరన్నరావు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

గణేష్ ఉత్సవ సమితి రాష్ట్ర కమిటీలో చోటు

కర్నూలు కల్చరల్: ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి రాష్ట్ర కమిటీలో ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరికి చోటు దక్కింది. విజయవాడలో జరిగిన సమావేశంలో ప్రకటించిన కమిటీలో వీరికి స్థానం కల్పించారు. నంద్యాల జిల్లాలో గణేష్ ఉత్సవ సమితిలో కీలకంగా వ్యవహరిస్తున్న రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ జి.రామకృష్ణారెడ్డిని ఉపాధ్యక్షులుగా, కర్నూలు జిల్లాలో శ్రీ గణేష్ మహోత్సవ కేంద్ర సమితి జిల్లా అధ్యక్షుడు బి.వేణుగోపాల్‌ను కార్యదర్శిగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీలో చోటు పొందిన ఇరువురికి జిల్లా ఉత్సవ సమితి తరపున అభినందనలు తెలిపారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రాయలసీమ రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ చాడేశ్వరి చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మెడికవర్ హాస్పిటల్ వారు విడుదల చేసిన 'వందేమాతరం హెల్త్ చెకప్ ప్యాకేజీ'ని సోమవారం ఆమె ఆవిష్కరించారు. 40 ఏళ్లు దాటిన వారు తరచూ పరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్యంగా ఉండాలన్నారు.

కూటమి పాలనలో మద్యపుటేరులు

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వంలో మంచినీటికైతే కరువుందని, మద్యానికి మాత్రం ఎలాంటి ఇబ్బంది లేకపోవడంతో ఏరులై పారుతోందని ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలు విమర్శించారు. సోమవారం సోమిశెట్టి నగర్‌లోని 19, 20 వార్డుల ఐద్వా సమావేశాన్ని యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఎక్కడ చూసిన మద్యం ఏరులై పారుతోందని, తాగిన వారు రోడ్లపైనే దొర్లుతున్నారని, వారి భార్య పిల్లల గురించి పట్టించుకోవడం లేదని ఆవేదన చెందారు. మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రత్నమ్మ, పీఎస్ సుజాత పాల్గొన్నారు.

నేడు సన్మాన సభ

కర్నూలు(అగ్రికల్చర్): పదవీ విమరణ చేసిన ఏపీ ఎన్‌జీజీవోస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి ఆత్మీయ సన్మాన సభను విజయవంతం చేయాలని కర్నూలు నగర శాఖ అధ్యక్షుడు ఎంసీ కాశన్న పిలుపునిచ్చారు. సోమవారం కర్నూలు ఏడీఏ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మంగళవారం ఉదయం 10 గంటలకు బిర్లా గేట్ సమీపంలోని లక్ష్మి ఫంక్షన్ హాల్‌లో సన్మాన సభ జరుగుతుందని తెలిపారు.

పగుళ్లు.. ప్రమాదాలు

- జీటలు బారిన సీసీ రోడ్డు
- వరుస ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు



గడిగరేవుల - తిరుపాడు రహదారిలో పగుళ్లు ఇచ్చిన దృశ్యం

గడివేముల: ఆ రోడ్డులో ప్రయాణించాలంటే చాలా జాగ్రత్తగా వెళ్లాలి లేకుంటే ప్రాణాలు గాలిలో కలిసి పోయే ప్రమాదం ఉంది. గడివేముల నుంచి నంద్యాల వెంకటేశ్వరపురం వరకు రోడ్డు చాలా దారుణంగా ఉండేది. జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఫ్యాక్టరీ నుంచి వెంకటేశ్వరపురం ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి పర్మిమిషన్ తెచ్చుకుని సొంతంగా సీసీ రోడ్డును వేశారు. అంత వరకు బాగానే ఉన్న ఫ్యాక్టరీ చెందిన భారీ వాహనాలు ఈ రోడ్డుపై ప్రయాణించడంతో రోడ్డంతా పగుళ్లు నిచ్చింది. భారీగా ఏర్పడిన చీలికలకు తారుపూసి రోడ్డు మరమ్మతులు చేసినట్లు జిందాల్ యాజమాన్యం చూపించుకున్నారు. ముఖ్యంగా గడిగరేవుల-తిరుపాడు గ్రామాల మధ్యలో సీసీ రోడ్డులపై చీలికలు ఇవ్వడంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. సీసీ రోడ్డు నిర్మించుకున్న అనంతరం ఆర్‌అండ్‌బీ శాఖకు జిందాల్ యాజమాన్యం ఇటీవల అప్పగించింది. దీంతో ఈ రోడ్డును మరమ్మతులను ఆర్ అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు విమర్శిస్తున్నారు. గతంలో పగళ్లు ఇచ్చిన చోట తుతూ మంత్రంగా పనులు చేసి పగుళ్లను వదిలివేస్తున్నారని మండల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డులో ప్రయాణించాలంటే ఇబ్బందిగా ఉంది



గడివేముల నుంచి నంద్యాలకు జిందాల్ యాజమాన్యం నిర్మించుకున్న సీసీ రోడ్డులో ప్రయాణించాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. రోడ్డులో భారీ వాహనాలు తిరగడంతో రోడ్డులపై పగుళ్లు వచ్చాయి. రోడ్డు చీలికలో బైకు టైరు పడిందటే కింద పడాల్సిందే. ఇటీవలే మా గ్రామానికి చెందిన వ్యక్తి ఈ పగుళ్ల కారణంగా తీవ్రంగా గాయపడ్డాడు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుపై పగుళ్లను పూడ్చివేయాలి.

– రాచమల్లు గోపాలయ్య, గడిగరేవుల గ్రామం.

ప్రమాదాలను నివారించండి



జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి వెంకటేశ్వరపురం వరకు వేసిన సీసీరోడ్డుపై పగుళ్లను పూడ్చి ప్రమాదాలు లేకుండా చూడండి. ముఖ్యంగా గడిగరేవుల-తిరుపాడు గ్రామాల మధ్యలో రోడ్డు పూర్తి అధ్వానంగా ఉంది. రాత్రివేళల్లో ఈ రోడ్డు పగుళ్లు కనిపించక పోవడంతో ప్రమాదాలకు గురైన సంఘటనలు అనేకం. కొత్త వారు ఈ రోడ్డులో ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– గని ప్రతాప్‌రెడ్డి

రోడ్డుపై గుంతలు.. అధికారుల కళ్లకు గంతలు



ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలు

రోడ్డు ఛిద్రమై ఏర్పడిన గుంతలు అధికారుల నిర్లక్ష్యంతో మృత్యుకూపాలుగా మారుతున్నాయి. ప్రధాన రహదారిపై గుంతలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు మాత్రం తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కోడుమూరు ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్, ఎమ్మిగనూరు రోడ్డులో నడి రోడ్డుపై భారీగా గుంతలేర్పడ్డాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు గుంతలను పూడ్చకపోవడంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మరింత పెద్దగా మారి వాహనదారుల పాలిట ప్రమాదకరంగా మారాయి. పగటి వేళ గుంతలను గమనించి వాహనదారులు జాగ్రత్త పడుతున్నా, రాత్రి సమయంలో గుంతలను గమనించ కుండా వెళ్లి ప్రమాదాల భారీన పడుతున్నారు. ముఖ్యంగా వర్షం కురిసే సమయంలో రోడ్డుపై గుంతులు కన్పించకుండా నీళ్లు నిలిచిపోయివుండడంతో ద్విచక్ర వాహనదారులు గమనించ కుండా వాటిల్లో పడిపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి నడి రోడ్లపై ఏర్పడ్డ గుంతలకు శాశ్వతంగా మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

– కోడుమూరు రూరల్

భూ సమస్యలు పరిష్కరించండి



పీజీఆర్ఎస్‌లో సమస్యలు తెలుసుకుంటున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి

సి.బెళగల్: తమ భూ సమస్యలను పరిష్కరించాలని ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో రైతులు అధిక సంఖ్యలో వినతులు ఇచ్చారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి వివిధ శాఖల మండల అధికారులు, రెవెన్యూ అధికారులు, వీఆర్వోలతో కలిసి పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని కొత్తకోట, ముడుమాల, బ్రాహ్మణదొడ్డి, బురాన్‌దొడ్డి, సి.బెళగల్ గ్రామాలకు చెందిన పలువురు రైతులు తమ భూములను రికార్డుల కొలతల ప్రకారం తమకు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, తమ భూములకు హద్దులను గుర్తించి తమకు హక్కులను కల్పించాలని తహసీల్దార్‌కు అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఓ మల్లేష్‌కుమార్, ఆర్ఐ తరుణ్, మండల సర్వేయర్ నాగభూషణం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, వీఆర్వోలు ఉన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఎంపీడీఓ రాణెమ్మ, డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరి, ఆర్‌డబ్ల్యుఎస్, హౌసింగ్ ఏఈలు గోసేనాయక్, సుమంత్, ఏపీఓ రామన్నలు హాజరవగా, మిగిలిన కొంత మంది అధికారులు ఆలస్యంగా విధులకు హాజరయ్యారు.

పిలల్లందరికీ 'ఆల్బెండజోల్' ఇవ్వాలి

- ఎన్‌డీడీ రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ రామగిడ్డయ్య



రికార్డులు పరిశీలిస్తున్న రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్య

ఓర్వకల్లు: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ (ఎన్‌డీడీ) సందర్భంగా పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలని కార్యక్రమం రాష్ట్ర పరిశీలకులు, 4వ జోన్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్య అన్నారు. కార్యక్రమాన్ని పురస్కరించుకొని సోమవారం హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. కార్యక్రమంలో ముందుగా ఆరోగ్య కేంద్రంలో నిల్వవున్న మాత్రలు, కేంద్రం పరిధిలో ఎన్ని అంగన్‌వాడి కేంద్రాలు, పాఠశాలలు, మొత్తం పిల్లల సంఖ్యను గూర్చి వైద్యాధికారిణి డా.రేఖను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హుసేనాపురంలోని అంగన్‌వాడీ కేంద్రాలను, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్‌డీడీ కార్యక్రమం మొదటి రోజుననే వంద శాతం పూర్తయ్యేటట్లు చూడాలని వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ప్రాథమిక ఆరోగ్యం పరిధిలో 34 అంగన్‌వాడీ కేంద్రాలు, 43 పాఠశాలల్లో కలిపి (1–18 ఏళ్ల వయస్సు) గల పిల్లలు మొత్తం 10,200 మంది ఉన్నట్లు గుర్తించామని డా.రేఖ వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి డా.రేఖ, ఎఎన్ఎం షకీలా, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పీహెచ్ఎన్ఓ రాబర్ట్ పాల్గొన్నారు.

ఉప్పొంగిన వాగులు, వంకలు



నెరవాడ పాత బ్రిడ్జిపై పొంగి ప్రవహిస్తున్న వక్కెర వాగు



గడివేములలో భారీ వర్షానికి మొక్కజొన్నలో నిల్వ ఉన్న వర్షపునీరు



ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూ

కల్లూరు: సోమవారం తెల్లవారుజాము నుంచి మండలంలో భారీ వర్షం పడటంతో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. నెరవాడ బ్రిడ్జిపై వక్కెర వాగు పొంగి ప్రవహించింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నెరవాడ వక్కెర వాగుపై వర్షకాలంలో వంక ఉధృతంగా ప్రవహిస్తున్నప్పుడు మనుషులు దాటడానికి వీలుగా నిర్మించిన బ్రిడ్జిపై ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. కొంగనపాడు గ్రామ సమీపంలోని పెద్ద వంక పొంగిప్రవహించడంతో కొన్ని గంటల పాటు ప్రయాణికుల రాకపోకలు నిలిచిపోయ్యాయి. మండల వ్యాప్తంగా 38.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. అలాగే ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల వల్ల హంద్రీ నదికి వరద నీరు చేరడంతో నిండుగా ప్రవహిస్తుంది.

గడివేములలో.. మండలంలో 68.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ వర్గాలు తెలిపాయి. భారీ వర్షానికి ఒండుట్ల, ఎల్‌కే తాండ, గని, బొల్లవరం, తిరుపాడు గ్రామాల్లో సాగు చేసిన పత్తి, సోయాబీన్, మొక్కజొన్న పొలాల్లో వర్షపు నీరు నిల్వ నిలిచింది. రైతులు పొలాలకు వెళ్లి నీటిని లోతట్టు ప్రాంతాలకు వదిలారు. అలాగే గ్రామ సమీపంలోని కుందూ ఉధృతంగా ప్రవహిస్తోంది. గడివేముల జెడ్పీ హైస్కూల్ మైదానంలో వర్షపు నీరు చేరి చెరువును తలపిస్తోంది.

పొంగి పొర్లుతున్న గార్గేయపురం చెరువు

కర్నూలు(రూరల్): కర్నూలు – గుంటూరు రహదారి పక్కన ఉన్న గార్గేయపురం చెరువు పొంగి పొర్లుతూ ఆకట్టుకుంటోంది. రెండు రోజులుగా చెరువు ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలకు పడటంతో భారీగా నీరు వచ్చి చేరి అలుగు ఎక్కి పారుతోంది. ఈ రహదారి మీదుగా వెళ్తున్న ప్రజలు చెరువు అందాలను వీక్షిస్తూ ఆస్వాదిస్తున్నారు.



రేమడూరు సమీపంలో ప్రవహిస్తున్న హంద్రీనది

అనుమతుల్లేకుండా 8వ తరగతి నిర్వహణ

కోడుమూరు రూరల్: గూడూరులో అనుమతి లేకుండా 8వ తరగతి నిర్వహిస్తున్న జూనియర్ గ్లోబల్ ప్రైవేట్ పాఠశాలకు నోటీసు జారీ చేసినట్లు ఎంఈఓ సునీలమ్మ సోమవారం తెలిపారు. ఈ పాఠశాలకు 1 నుంచి 7 వరకు మాత్రమే తరగతులు నిర్వహించేందుకు అనుమతులు ఉన్నా 8వ తరగతి విద్యార్థులను కూడా చేర్పించుకుని తరగతులు నిర్వహిస్తున్నారనాన్నారు. సోమవారం పాఠశాల తనిఖీకి వెళ్లి గుర్తించామన్నారు. 8వ విద్యార్థులకు ఇతర పాఠశాలల్లో చేరేందుకు వెంటనే టీసీ ఇచ్చి పంపాలని యాజమాన్యాన్ని ఆదేశించామన్నారు. చర్యల నిమిత్తం జిల్లా విద్యా శాఖాధికారులకు దృష్టికి తీసుకెళ్లినట్లు ఎంఈఓ వివరించారు.

16 నుంచి గోకులాష్టమి వేడుకలు

పాణ్యం: ఈనెల 16వ తేదీ నుంచి గోకులాష్టమి వేడుకలు ప్రారంభమవుతాయని పాణ్యం దేవదాయశాఖ ఈఓ కె. సువర్ణ అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. పాణ్యం శ్రీ వీరనారాయణ స్వామి ఆయలంలో 16న శ్రీవారి కల్యాణం, 17న స్వామి వారికి ప్రత్యేక పూజలు, 18న అన్న ప్రసాద వితరణ ఉంటుందన్నారు. అదే రోజు సాయంత్రం గ్రామోత్సవం చేపడుతున్నామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని వేడుకలను విజయవంతం చేయాలన్నారు.

డ్రైనేజీల్లో పూడిక తొలగించాలి

కల్లూరు: కల్లూరు అర్బన్ 29వ వార్డు సవారి తోట డ్రైనేజీలో పెరిగిన పిచ్చి మొక్కలతో పాటు పూడిక తొలగించాలని స్థానిక కేవీపీఎస్ నాయకులు యేసు, సరోజమ్మ, మధు డిమాండ్ చేశారు. సోమవారం వారు కాలనీలో పర్యటించారు. డ్రైనేజీ కాల్వలు అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగునీరు ఇళ్ల ముందు నిలిచి కంపుకొడుతుందన్నారు. కేవీపీఎస్ నాయకులు మౌలాలి, గుర్రాజు, పెద్ద మధు, మధు పాల్గొన్నారు.

విద్యుత్ పరికరాలతో జాగ్రత్త

కర్నూలు(రూరల్): రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున ప్రజలు విద్యుత్ పరికరాలతో జాగ్రత్తగా ఉండాలని విద్యుత్ ఏఈ మహమ్మద్ ఇస్మాయిల్ సూచించారు. సోమవారం ఆయన మాట్లడుతూ.. వర్షాలు కురిసే సమయంలో స్టేవైర్, విద్యుత్ లైన్ల కింద, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో నిల్చోరాదన్నారు. పశువులు, పెంపుడు జంతువులను కూడా విద్యుత్ పరికరాలకు దూరంగా ఉంచాలన్నారు. పొలాలు, రహదారులపై విద్యుత్ తీగలు తెగిపడితే అప్రమత్తమై, అటు వైపు ఎవరూ వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు వెంటనే 9440813367కు సమాచారం ఇవ్వాలన్నారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

కర్నూలు: ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గుడుంబాయి తాండ గ్రామ శివారులో పోలీసుల తనిఖీల్లో భారీగా నాటుసారా పట్టుబడింది. సీఐ చంద్రహాస్ ఆదేశాల మేరకు ఎస్ఐ నవీన్‌బాబు తన సిబ్బందితో సోమవారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా గుడుంబాయి తాండకు చెందిన లక్ష్మీనాయక్ ద్విచక్ర వాహనంపై రెండు ప్లాస్టిక్ సంచుల్లో 50 లీటర్ల సారాను కాల్వబుగ్గ గ్రామానికి తరలిస్తూ పట్టుబడ్డాడు. వాహనంతో పాటు సారాను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

నీటి తొట్టిని తొలగించండి

పాణ్యం: ఆలమూరు గ్రామ ఎస్సీ కాలనీలో నిర్మించిన నీటి తొట్టిని తొలగించాలని కాలనీ వాసులు సోమవారం నంద్యాల కలెక్టర్ రాజకుమారికి పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ పశువుల నీటి అవసరాలకు నీటిని తొట్టిలను ఊరి చివర నిర్మించకుండా, జనవాసాల మధ్య ఓహెచ్‌ఆర్ ట్యాంక్ వద్ద నిర్మించారన్నారు. ఆ తొట్టితో చిన్నారులు, వృద్ధులకు ప్రమాదం పొంచి ఉందని, వెంటనే దానిని తొలగించాలన్నారు. స్పందించిన కలెక్టర్ డ్వామా పీడీకి సమస్యను ఎండార్స్ చేశారని తెలిపారు.

కోడుమూరులో చోరీ

కోడుమూరు రూరల్: కోడుమూరు లక్ష్మీనగర్‌లోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. కోడుమూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గిరి కుటుంబ సభ్యులతో కలిసి నాలుగు రోజుల క్రితం ఇంటికి తాళాలు తిరుపతికి వెళ్లి సోమవారం ఉదయం తిరిగి చేరుకున్నాడు. అయితే ఇంటికి వేసిన తాళాలు పగులగొట్టడంతో పాటు, బీరువా తెరిచి ఉండడంతో ఆందోళనకు గురయ్యాడు. బీరువాలో ఉంచిన రూ.30 వేలను దొంగలు ఎత్తుకెళ్లినట్లు గమనించాడు. అయితే దొంగలు కేవలం నగదును మాత్రమే తీసుకుని ఇంట్లో విలువైన వస్తువులను ఏమి ఎత్తు కెళ్లలేదు. బాధితుడు కోడుమూరుకు పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు ఇంటి వద్దకు చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు.

ఐరన్ ఓర్ లీజును రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కల్లూరు: పులగుమ్మి పొలాల్లో సీతారామయ్య ఐరన్ ఓర్ కంపెనీ లీజును రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కల్లూరు తహసీల్దార్ కార్యాలయం దగ్గర ఐరన్ ఓర్ లీజును రద్దు చేయాలని పుల్లగుమ్మి రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. పచ్చని పొలాల్లో అధికారులు ఏమాత్రం పరిశీలన చేయకుండా ఐరన్ ఓర్ లీజుకు ఇవ్వడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శమని ధ్వజమెత్తారు. కలెక్టర్ స్థాయి అధికారులు ఒక్కసారి పుల్లగుమ్మి రైతుల పొలాలను పరిశీలన చేసి రైతులకు న్యాయం చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ ఆంజనేయులుకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోటకొండ సూరి, బొల్లవరం కృష్ణ, పుల్లగుమ్మి రైతులు లక్ష్మన్న, నాగరాజు, జనార్దన్, వెంకటస్వామి, రాజు, బాధిత రైతులు పాల్గొన్నారు.

బడికెళ్లాలంటే వాగు దాటాల్సిందే !



ఎద్దుల బండిపై వాగుదాటుతున్న చిన్నారులు

ఓర్వకల్లు: ఉప్పలపాడు విద్యార్థులు ఊరి చివర ఉన్న జెడ్పీ పాఠశాలకు వెళ్లాలంటే ఈ వాగు దాటక తప్పడం లేదు. కొందరు చిన్నారులు వాగుదాటలేక వర్షాకాలం బడిమానుకొని ఇళ్లవద్దనే ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామంలో ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో మూత వేసి విద్యార్థులను ఉయ్యాలవాడ దారిలో ఉన్న జెడ్పీ పాఠశాలకు తరలించారు. అప్పటి నుంచి 1 నుంచి 5వ తరగతి చిన్నారులు అవస్థలు పడుతున్నారు. భారీ వర్షాలు కురిసినప్పుడు కుందూ వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో పదో తరగతి పిల్లలు కూడా పాఠశాలకు వెళ్లలేని పరిస్థితి. ప్రస్తుతం రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి కుందూ వాగు పొంగిపొర్లడంతో చిన్నారులు వాగును దాటలేక ఎద్దుల బండ్లపై పాఠశాలకు వెళ్లాల్సి వచ్చింది. పెద్ద పిల్లలు వాగును దాటేందుకు సహాసం చేయాల్సిందే. ప్రతి రోజు పాఠశాలకు వెళ్లివచ్చే క్రమంలో పిల్లలకు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని తల్లితండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి కుందూ వాగుపై వంతెన ఎత్తును పెంచాలని కోరుతున్నారు. లేదంటే ఊరిలో ఉన్న శిథిలమైన ప్రాథమిక పాఠశాలకు మర్మమతులు చేసి తరగుతులు పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదకర పరిస్థితుల్లో వాగుదాటుతున్న విద్యార్థులు

అవినీతిపై విచారణ జరపాలి

కర్నూలు(సెంట్రల్): కేవీఆర్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ లాలప్ప అవినీతి, నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలని పలు విద్యార్థి, యువజన సంఘాల నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 13 ఏళ్లుగా విద్యార్థుల నుంచి స్పెషల్ ఫీజులు, అక్యుములేట్ ఫండ్, అడ్మిషన్ల ఫీజులను వసూలు చేసి స్వాహా చేశారని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహేంద్రనాయుడు, సోషలిస్టు స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివప్రసాదుగౌడ్, పాగంటి రాజు, గోవర్ధన్ నాయుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో కలెక్టర్ పి.రంజిత్‌బాషా ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్షించి సీఎంఓ నుంచి వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే విచారణ జరపాలని, పీజీఆర్ఎస్ అర్జీలు రీఓపెన్ కాకుండా చూడాలని ఆదేశించారు. జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- ఓర్వకల్ మండలం ఉయ్యాలవాడ ప్రాథమిక పాఠశాల ఆవరణలో చిన్నపాటి వర్షం వస్తే నీరు నిల్వ ఉంటోందని, నీరు నిల్వకుండా శాశ్వత ప్రతిపాదికన చర్యలు చేపట్టాలని జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు వెంకటనాగరాజు విన్నవించారు.
- ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన కింద రైతులకు ఇచ్చే మొదటి విడత రూ.2 వేలు తనకు ఖాతాలో జమకాలేదని, వెంటనే జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని తుగ్గలి మండలం జొన్నగిరికి చెందిన ఏఎం నాగులాల్ విన్నవించారు.
- నూరు శాతం వికలత్వం ఉండి 13 సంవత్సరాల వయసు ఉన్నా ఎన్‌టీఆర్ భరోసా కింద పెన్షన్ మంజూరు కావడం లేదని కర్నూలు గురురాఘవేంద్ర నగర్‌కు చెందిన గొల్ల భరణి ఫిర్యాదు చేసింది.